నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 నిజామాబాద్, శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 NIZAMABAD

## నిజాంసాగర్ మూడు గేట్లు ఎత్తివేత

నిజాంసాగర్, సెప్టెంబర్ 5:ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతున్నది. 10 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో ఉండగా, మూడు గేట్లు ఎత్తి దిగువకు ఆ మేరకు నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగుల (17.802 టీఎంసీలు)లకు గాను, ప్రస్తుతం 1404 అడుగుల (17.079 టీఎంసీలు) మేర నిల్వ ఉంచి, మిగులు జలాలను దిగువకు వదులుతున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. మరో వైపు, నిజాంసాగర్ ఎగువన ఉండే సింగూరు ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో అక్కడ గేట్లను ఎత్తివేశారు. దీంతో ఆ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టు లోకి వచ్చి చేరనున్నది.


నిజాంసాగర్ ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న మిగులు జలాలు


కందకుర్తి వద్ద నదిలో బయటపడిన పురాతన శివాలయ శిఖరం

## శాంతించిన గోదావరి

**• ఎస్సారెస్పీ గేట్ల మూసివేత • 'మహా' వైపు రాకపోకలు షురూ**

మోర్తాడ్/రెంజల్, సెప్టెంబర్ 5: మహోగ్ర రూపం దాల్చిన గోదావరి శాంతించింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు నిలిచి పోవడంతో వరద తగ్గుముఖం పట్టింది. రెంజల్ మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమం వద్ద నిన్నటిదాకా ఉరకలెత్తిన గోదావరి ప్రస్తుతం ప్రశాంతంగా కనిపిస్తున్నది. నీట మునిగిన పురాతన శివాలయ శిఖరం వరద తగ్గడంతో బయట పడింది. కందకుర్తి వద్ద గల వంతెన పైనుంచి వరద ప్రవహించడంతో మూడు రోజులుగా మహారాష్ట్ర వైపు రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే, వరద తగ్గిపోవడంతో గురువారం నుంచి రాకపోకలను పునరుద్ధరించారు. అంతర్రాష్ట్ర మార్గంలో వాహనాలను అనుమతిస్తున్నామని బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

**ఎస్సారెస్పీకి తగ్గిన వరద..**

పోచంపాడ్ వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లు మూసేశారు. ఇటీవలి వర్షాలకు 3.50 లక్షల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో రాగా, 41 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే వరద తగ్గిపోవడంతో గేట్లను మూసి వేశారు. గురువారం సాయంత్రానికి 67 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 1089 అడుగులు( 73.369 టీఎంసీలు) నీటి నిల్వ ఉంది. 8,867 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. ఈ సీజనల్ ఇప్పటిదాకా ఎస్సారెస్పీకి 141.314టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా, 77.245 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

## కొణతం దిలీప్ అరెస్టు అక్రమం

**• బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**



ఖలీల్‌వాడి,సెప్టెంబర్: తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ అరెస్టు అక్రమమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలన చేతగాక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నదని ఆరోపించారు. తొమ్మిది నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఆగం చేసిందని విమర్శించారు. అప్రకటిత నిర్బంధం కొనసాగుతున్నదని తెలిపారు. దిలీప్‌ను బేషరతుగా విడుదలచేయాలని డిమాండ్ చేశారు.




## ప్రభుత్వ పరిహారంపై ఆశలు పెట్టుకున్న రైతులు

నిజామాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) :

**భారీ నుంచి అతి భారీ వర్షాలు** కురియడంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు తడిసి ముద్దయ్యాయి. కుండపోత వానలతో రైతాంగం కుదేలైంది. కొద్ది రోజుల్లో పంట చేతికి రానున్న తరుణంలో దంచికొట్టిన వర్షాలు రైతులకు శాపంగా మారాయి. వరద పోటెత్తడంతో వేలాది ఎకరాలు నీట మునిగాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి, మక్కజొన్న, పత్తి, సోయా తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. నాలుగైదు రోజుల నుంచి కురిసిన వర్షాలు గురువారం కాస్త తెరిపినిచ్చాయి. అయితే, వానలు, వరదలతో ఎంత నష్టం జరిగిందనే లెక్క తేల్చడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించినట్లు కనిపిస్తున్నది. క్షేత్ర స్థాయిలో జరిగిన వాస్తవ నష్టం లెక్క తేల్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే ఇటీవల ఖమ్మం, మహబూబాబాద్ వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ భారీగా పంట పొలాలు దెబ్బతిన్న తరుణంలో.. ప్రభుత్వం నుంచి సాయం అందుతుందనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. కానీ, వ్యవసాయ అధికారులు ఇంకా క్షేత్ర స్థాయి పర్యటనకు రాకపోవడంపై ఆందోళన చెందుతున్నారు.

సిరికొండ మండలం చీమన్‌పల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు


భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

### రూ. 6 లక్షలు నష్టపోయా..



బోధన్ రూరల్, సెప్టెంబర్ 5 : హంగర్గ గ్రామశివారులో 25 ఎకరాల్లో సోయా వేశా. ఇటీవల కురిసిన వర్షాలకు మంజీరా పరీవాహక ప్రాంతంలో 18 ఎకరాల సోయా పంట నీట మునిగింది. సుమారు రూ.6 లక్షల మేర నష్టపోయా.ప్రతి ఏడాది పంటలు ఇలాగే నీట మునుగుతున్నాయి. మా ప్రాంతంలో సుమారు 800 ఎకరాల పంటకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

**- శ్యాం, రైతు, హంగర్గా గ్రామం, బోధన్ మండలం**

### 12 ఎకరాల పంట నీట మునిగింది



హంగర్గ గ్రామశివారులో నేను 15 ఎకరాల్లో సోయా పంట సాగు చేశా. వర్షం కారణంగా 12 ఎకరాల పంట నీట మునిగింది. దీంతో సుమారు రూ. 4 లక్షలు నష్టపోయాను. అధికారులు సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

**- డి.సంతోష్, రైతు, హంగర్గా గ్రామం, బోధన్ మండలం**

### అంచనాల్లో జాప్యం..

రైతులు కుదేలైన దుస్థితి కళ్ల ముందే కనిపిస్తుండగా అంచనాలు రూపొందించడంలో వ్యవసాయ శాఖ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. గతంలో మాదిరి కాకుండా ఆలస్యం చేస్తుండడంతో ఓ వైపు కర్షకులకు, మరోవైపు ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నష్టపోయిన రైతుల వివరాలను క్లస్టర్ల వారీగా ఏఈవోలు సేకరించాల్సి ఉండగా, వారు అసలు ముఖమే చూడడం లేదని రైతులు వాపోతున్నారు. పంట రుణమాఫీ విషయంలో దరఖాస్తుల స్వీకరణ, అనుమానాల నివృత్తిలో బిజీగా ఉండటం వల్ల పని ఒత్తిడితో ఇబ్బందికి గురవుతున్నామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు ఉన్నతాధికారులకు ఏఈవోలు రిపోర్టు చేసినట్లు తెలిసింది.

పంట నష్ట వివరాల సేకరణ ఆలస్యం చేస్తే వచ్చే పరిహారం రాకుండా పోతుందేమోనన్న భయం రైతుల్లో నెలకొంది. వానలు తెరిపినిచ్చిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని అన్నదాతలు కోరుతున్నారు. వ్యవసాయాధికారులకు ఫోన్లు చేస్తూ తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలంటూ బోధన్ డివిజన్ పరిధిలోని రైతన్నలంతా వేడుకుంటున్నారు. పట్టాదారు పాస్‌బుక్కులతో రైతువేదికల వద్దకు తరలి వెళ్తుండగా పొలాల వద్దకే వచ్చి నష్టపోయిన పంట వివరాలు తీసుకుంటామంటూ ఏఈవోలు వారికి బదులిస్తున్నారు. నవీపేట మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌తో వందలాది ఎకరాల్లో వరి పంట మునకేసింది. దీంతో రైతుల పరిస్థితి గందరగోళంలో పడింది. పొలాల్లో అడుగు పెట్టే అవకాశమే లేకపోవడంతో నష్ట పరిహారం అందుతుందా.. లేదా? అన్నది తెలియడం లేదు. ముంపు లేకుండా పరిశీలన చేస్తానని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ పరిహారం అందిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

- **ఇంకా లెక్క తేల్చని వ్యవసాయ శాఖ**
- **లబోదిబోమంటున్న అన్నదాతలు**
- **పంట పొలాల్లో ఇసుక మేటలు**
- **నష్ట తీవ్రత లెక్కింపులో అంతులేని జాప్యం**

### బోధన్, రెంజల్‌లోనే ఎక్కువ..

నిజామాబాద్ జిల్లాలో అధికారులు చెబుతున్న ప్రకారం 2,602 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. బోధన్ మండలంలో వెయ్యి ఎకరాలు, రెంజల్ మండలంలో 1500 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. మిగిలిన మండలాల్లో నీట మునిగిన చోట పంట నష్టాన్ని ఇంకా అంచనా వేయలేదు. వరద నీరు పొలాల నుంచి బయటికి వెళ్లి పోవడంతో నష్టం అంచనాల్లో వాటిని చేర్చలేదు. పైరు దెబ్బ తిన్నదని రైతులు ఎంతసేపు విన్నవించినా వారి వివరాలను నమోదు చేసేందుకు అధికారులు నిరాకరించినట్లు తెలిసింది. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రెండు రోజులుగా తన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులను వెంటేసుకుని పంట నష్టం వివరాల సేకరణపై ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఈ ప్రాంతాల్లో హుటాహుటిన నష్ట వివరాల జాబితాను రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా బోధన్ నియోజకవర్గంలోనే 90 శాతం నష్టాన్ని వ్యవసాయ శాఖ గుర్తించింది. మిగిలిన చోట్ల నష్టం జరగలేదని చెబుతున్నారు. అయితే, ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నందునా బాధిత రైతుల సంఖ్య మరింత పెరిగే వీలు ఉంటుందంటున్నారు. అర్హులైన వారందరికీ న్యాయం చేసేలా ప్రభుత్వ పెద్దలు కృషి చేయాలని రైతులు వేడుకుంటున్నారు.


అమీర్‌నగర్ -కోనాసముందర్ మధ్యలో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల

## నష్టంపై ప్రభుత్వానికి నివేదించాలి

- **అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
- **ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూడాలి**
- **అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి**

మోర్తాడ్/బాల్కొండ/ వేల్పూర్, సెప్టెంబర్ 5: భారీ వర్షాల నేపథ్యంలో జరిగిన నష్టంపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. మరిన్ని వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలన్నారు. భారీ వర్షాలతో నియోజకవర్గంలో దెబ్బ తిన్న రోడ్లను వేముల గురువారం పరిశీలించారు. అమీర్‌నగర్-కోనాసముందర్ రోడ్డు, అంక్సాపూర్-పోచంపల్లి రోడ్డుతో పాటు రామన్నపేట్-వేల్పూర్ మధ్య కొట్టుకుపోయిన కల్వర్టును చూశారు. అనంతరం బాల్కొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నియోజకవర్గంలో పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నిండి ఉన్నందున ఇరిగేషన్ అధికారులు అప్రత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు చెరువులను పర్యవేక్షించాలని సూచించారు.


మెండోరా మండలం బుస్సాపూర్‌లో సుమారు 40 ఎకరాల్లో పల్లి, వేల్పూర్ మండలం మోతెలో 10 ఎకరాల్లో వరి, పచ్చలనడ్కుడ గ్రామంలో ఐదెకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు తెలుపగా, అన్ని వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఎమ్మెల్యే సూచించారు. పంటలు చేతి కొచ్చే సమయం కావున మళ్లీ వర్షాలు కురిస్తే నష్టం మరింత పెరిగే అవకాశమున్నదని, రైతులు జాగ్రత్తలు తీసుకునేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో నియోజకవర్గంలో పెద్దగా ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా, మోర్తాడ్‌లోని మొండి వాగులో గల్లంతై చనిపోయిన కామారెడ్డికి చెందిన రైతు కూలీ వివరాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు.

### రోడ్లు, కల్వర్టులు పునరుద్ధరిస్తాం

వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల పునరుద్ధరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల తెలిపారు. కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆర్‌అండ్‌బీకి సంబంధించి రామన్నపేట్-వేల్పూర్ మధ్య కల్వర్టు, కమ్మర్‌పల్లి-ఉప్లూర్ మధ్య కల్వర్టు, పడగల్ గ్రామసమీపంలో రాకపోకలు స్తంభించిన ప్రాంతాన్ని బాగు చేయించాలని ఆర్‌అండ్‌బీ మంత్రిని కోరుతామన్నారు. అమీర్‌నగర్-కోనాసముందర్ రోడ్డు, అంక్సాపూర్-పోచంపల్లి మధ్య రోడ్డును బాగు చేయించాలని పంచాయతీరాజ్ మంత్రికి విన్నవిస్తామన్నారు. సంబంధిత మంత్రులకు నివేదికలు పంపి ఫ్లడ్ డ్యామేజ్ పనులు చేపట్టేలా చూస్తామన్నారు. తెగిపోయిన చెరువులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, చెరువులు తెగే పరిస్థితిలో ఉంటే వాటిని విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆర్డీవో రాజాగౌడ్, ఏడీఏ శ్రీనివాసరాజు, తహసీల్దార్లు, ఇరిగేషన్ డీఈ సురేశ్, ఏఈలు, ఎంపీడీవో రాజశ్రీనివాస్, కమ్మర్‌పల్లి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, చిన్నారెడ్డి, ప్రకాశ్, గంగాధర్, రాజు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.


వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డును చూసేందుకు బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే వేముల

## 'ఉత్తములకు' అవార్డులు


మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రజాప్రతినిధులు, ప్రొఫెసర్ల చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఆర్. సుధాకర్‌గౌడ్, స్వర్ణలత, రామకృష్ణ


స్వరూప, పెద్దన్న, ముద్దుకృష్ణ, నరేందర్.

కామారెడ్డి/ భిక్కనూరు/ ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 6 : ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్ల అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ల చేతుల మీదుగా సన్మానం పొందారు. అవార్డులు అందుకున్న వారిలో టీయూ దక్షిణ ప్రాంగణం సహాచార్యులు ఆర్.సుధాకర్ గౌడ్, పాల్వంచ జడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ సైన్స్ టీచర్ స్వర్ణలత, చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల మ్యాథ్స్ టీచర్ రామకృష్ణ, ధర్మారం గురుకుల పాఠశాల ఇంగ్లిష్ పీజీటీ స్వరూప, మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న, దుబ్బ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ముద్దుకృష్ణ, ఆలూరు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నరేందర్ ఉన్నారు.

## నెరవేరిన సొంతింటి కల

**'డబుల్' లబ్ధిదారులకు ఇండ్లు కేటాయింపు**


లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులకు ఇండ్లను కేటాయిస్తున్న ఆర్డీవో రంగనాథ్‌రావు

భిక్కనూరు, సెప్టెంబర్ 5: పేదల సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరింది. భిక్కనూరు మండలంలోని బస్వాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపు గురువారం పూర్తయింది. కేసీఆర్ హయాంలో పేదల కోసమని బస్వాపూర్ గ్రామ శివారులో 50 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించారు. అప్పట్లోనే గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే, ఇండ్లను కేటాయించాల్సి ఉండగా, ఎలక్షన్ కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదు. తొమ్మిది నెలలు గడిచినా అడుగు ముందుకు పడకపోవడం, అద్దె భారం పెరిగిపోవడంతో లబ్ధిదారులు ఇటీవల డబుల్ బెడ్రూం ఇండ్లలోకి వెళ్లి అక్కడే నివాసముంటున్నారు. అయితే మూడ్రోజుల క్రితం వారిని అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఈ నేపథ్యంలోనే ఆర్డీవో రంగనాథరావు ఆధ్వర్యంలో గురువారం లక్కీ డ్రా నిర్వహించి, లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించారు. సొంతింటి కల నెరవేరిన తరుణంలో పేదలు సంతోషంగా గృహ ప్రవేశం చేశారు. తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై సాయికుమార్, ఆర్ఐ బాలయ్య పాల్గొన్నారు.